క్లుప్తంగా

అర్బన్ సీఐగా సీతారామయ్య



చిలకలూరిపేట: అర్బన్ పోలీస్‌స్టేషన్ నూతన సీఐగా సి.సీతారామయ్య బాధ్యతలను గురువారం స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా విధులు నిర్వహించిన రాజేశ్వరరావు ఇటీవల బదిలీ కావడంతో ఆయన స్థానంలో సీతారామయ్య నియమితులయ్యారు. 2003లో ఎస్ఐగా పోలీసు శాఖలో ప్రవేశించిన ఆయన 2011లో సీఐగా పదోన్నతి పొంది గుంటూరు, నెల్లూరు, ఒంగోలు ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. ఆయనకు ఎస్ఐలు, పోలీసు సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఓపెన్ హౌస్



ఈపూరు: పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఈపూరు ఎస్ఐ మహమ్మద్ ఫిరోజ్ పాఠశాల విద్యార్థులతో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలిసి పోలీస్ స్టేషన్ ఆవరణను సందర్శించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మండల మ్యాప్, లాకప్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దేశ రాజధానికి పవిత్రంగా...



శావల్యాపురం : మేరీ మట్టి మేరీ దేశ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని 15 గ్రామపంచాయతీలో సేకరించిన పవిత్రమైన మట్టిని ఢిల్లీలో నూతనంగా నిర్మించిన పార్లమెంటు భవనం ప్రాంగణంలో పోసేందుకు చర్యలు తీసుకున్నామని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సేకరించిన మట్టి కలశాలల సముదాయాన్ని ఒక కలశంపై చేర్చే కార్యక్రమం నిర్వహించారు. ఈవోపీఆర్‌డీ పి.సుగుణ, మండల స్వచ్ఛ కోఆర్డినేటరు కోటేశ్వరరావు, ఏపీవో రామారావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోషకాలు అందాలి



నరసరావుపేట రూరల్: వర్షాభావ పరిస్థితుల్లో నీటి సౌకర్యం లేని రైతులు మొక్కకు అవసరమైన పోషకాలను పైపాటుగా పిచికారీ చేయాలని ఉద్యాన శాస్త్రవేత్త రజిని తెలిపారు. మండలంలోని పమిడిమర్రు గ్రామంలోని ఉద్యాన పంటలను గురువారం పరిశీలించారు. మొక్కలకు పైపాటుగా పోషకాలు అందించడం ద్వారా అది మొక్క ఎదుగుదలకు ఉపయోగపడుతుందని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నరేంద్రబాబు, ఉద్యాన అధికారి నవీన్‌కుమార్, గ్రామ సర్పంచ్ దాసరి శ్రీనివాసరావు, ఉద్యాన సహాయకులు శ్రీకాంత్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భవ



వినుకొండ(నూజెండ్ల) : ఆయుష్మాన్‌భవ కార్యక్రమంలోభాగంగా నూజెండ్ల మండలంలోని ములకలూరు గ్రామంలో ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఆర్. శ్రీనివాస్ వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రజలు ప్రతి రోజూ మజ్జిగ, ఆకుకూరలు, కూరగాయలు, తృణధాన్యాలు సరిపడా తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. 54 మందికి బీపీ పరీక్షలు, తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఏఎన్ఎం మహాలక్ష్మి, ఆశ కార్యకర్త మరియమ్మ, గంగమ్మ పాల్గొన్నారు.

దాతల విరాళాలు

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో గంగమ్మతల్లి దేవాలయం పునఃనిర్మాణ పనులకు సంబంధించి గ్రామానికి చెందిన సూరబత్తిని మల్లేశ్వరరావు-నాగమణి కుటుంబ సభ్యులు 12 సెంట్లు స్థలాన్ని శిల విగ్రహాలను వితరణ చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. నూతన దేవాలయం రూ. 50 లక్షల వ్యయంతో చేపట్టగా పునఃనిర్మాణ పనులకు దాతలు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు.

సర్పంచ్‌గా చింతా విజయ్‌కుమార్

శావల్యాపురం: మండలంలోని బొందిలిపాలెం గ్రామపంచాయతీ సర్పంచ్‌గా చింతా విజయ్‌కుమార్ (అంకమ్మ) గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన సర్పంచ్ బోడాల వీరాంజినేయులు వ్యక్తిగత సెలవుపై వెళ్లినట్లు ఎంపీడీవో తెలిపారు.

ఓటు అడిగే హక్కు వారికి లేదు

- నియోజకవర్గ అభివృద్ధికి అడ్డు పడుతున్నారు!
- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- వినుకొండలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): వైఎస్సార్ సీపీ హయాంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక అడ్డుకుంటున్న టీడీపీకి ఓటు అడిగే హక్కు లేదని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. వినుకొండలోని ఓబయ్యకాలనీ సచివాలయం పరిధిలోని 23వ వార్డు కోటనాల్సాబజారులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు. అనంతరం వార్డు ప్రజలనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటింటికీ తిరుగుతున్నప్పుడు ప్రజలు తమకు ప్రభుత్వం అందించిన పథకాలు తెలియజేస్తూ సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. వినుకొండ అభివృద్ధి గత ప్రభుత్వంతో పోల్చి చూసుకోవాలన్నారు. గత పదేళ్లలో వినుకొండ వెనుకబడిన ప్రాంతంగానే ఉందని, కనీసం తాగునీరు అందించలేని స్థితిలో మున్సిపాలిటీ ఉందని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వినుకొండకు శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత మున్సిపల్ కాంప్లెక్స్‌లు, ఎన్ఎస్‌పీ కెనాల్‌పై సీసీ రోడ్లు, ఘాట్‌రోడ్డు నిర్మాణం, గిరిప్రదక్షిణం రోడ్డుతో పాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అభివృద్ధి పనులపై కోర్టులో కేసులు వేస్తూ అడ్డుకుంటున్నారని, ఎవరు ఎన్ని విధాలా అడ్డుపడినా వినుకొండ అభివృద్ధిని ఆపలేరన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్కిల్ స్కాం కేసులో రూ.371 కోట్లు అవినీతికి పాల్పడి జైలుకు వెళ్లారని, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత లక్షల కోట్ల రూపాయలు సంక్షేమానికి ఖర్చు చేయడమే కాకుండా నవరత్నాల పేరుతో అన్నివర్గాలను ఆదుకున్నట్లు చెప్పారు. వినుకొండలో ముస్లిం మైనార్టీలకు కళాశాల, షాదీఖానాకు త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. మసీదు మాన్యంలో గత ప్రభుత్వ హయాంలో దోచుకున్న భూములను ముస్లింలకు చెందే విధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పీఎస్ ఖాన్, వార్డు కౌన్సిలర్ నన్నేసా, వైస్ చైర్మన్ బేతం గాబ్రియేలు, కౌన్సిలర్లు షకీలా దస్తగిరి, ఎంఎస్‌కే బాషా, గంటా కాలేషా, నంది నరసింహారావు, పాపసాని బ్రహ్మయ్య, మాజీ ఎంపీపీ ములకా రామతులసిరెడ్డి, పార్టీ నాయకులు అవినాష్‌రెడ్డిలతో పాటు మున్సిపల్ కమిషనర్ వెంకయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ ప్రథమ లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- వేర్వేరు ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు
- వందలాదిగా తరలివచ్చిన రోగులు



కేసానుపల్లిలో రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: పేదల ఆరోగ్య రక్షణే ప్రథమ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని కేసానులపల్లిలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి సందర్శించారు. శిబిరంలో అందుతున్న వైద్య సేవలపై రోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ అనేక కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. వైద్య శిబిరంలో 593 మందికి పరీక్షలు నిర్వహించారు.

రావులాపురంలో..

బొల్లాపల్లి: మండలంలోని రావులాపురం గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ఎంపీపీ బత్తిరాములు, సర్పంచ్‌లు ఎ. పున్నారెడ్డి, ఎంపీటీసీ పి. ఎర్రయ్యలు ప్రారంభించారు. ఈ శిబిరంలో వైద్యులు పి. శంకర్ నారాయణ, పి. కృష్ణానాయక్, ఎం. సాయి వినూత్న, ప్రత్యేక వైద్య నిపుణులు పి. రాంబాబు, పి.సౌజన్య, ఎస్. జానీహీరాలు రోగులకు వైద్య చికిత్సలు చేసి మందులు అందజేశారు.

శావల్యాపురం మండలంలో...

శావల్యాపురం: మండలంలోని 10 గ్రామసచివాలయాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించగా 3714 మంది రోగులకు వైద్య సేవలు పారదర్శకంగా అందించినట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య గురువారం తెలిపారు.

సాతులూరులో...

నాదెండ్ల: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య క్యాంపులో అందిస్తున్న మెరుగైన సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు చెప్పారు. మండలంలోని సాతులూరు-2 సచివాలయంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును నిర్వహించారు. గత నెల 30న సంకురాత్రిపాడు గ్రామంలో ప్రారంభమైన ఆరోగ్య సురక్ష క్యాంపులు, గురువారంతో ముగిశాయి.

బరంపేటలో..

నరసరావుపేట: పట్టణంలోని బరంపేటలో గల ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్) వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దీనికి ఆయాప్రాంతానికి చెందిన 271 మంది హాజరై వైద్యపరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 129 మందికి కంటి పరీక్షలు చేశారు. ప్రతి ఒక్కరికీ ఉచితంగా మందులు అందజేశారు. క్యాంపును డాక్టర్ జి.హర్షవర్ధనరెడ్డి పర్యవేక్షించగా, జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ బి.రవి పరిశీలించి డాక్టర్లు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. రోగులకు ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు, జనరల్ మెడిసిన్, ఆప్తమాలజీ డాక్టర్లు ప్రియాంక, త్రివేణి, మేఘన సేవలు అందజేశారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థికసాయం

వినుకొండ(నూజెండ్ల): రూరల్ పరిధిలోని అందుగల కొత్తపాలెం గ్రామంలో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన నాలుగు కుటుంబాలను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పరామర్శించారు. సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించి బాధితులకు అండగా ఉంటానని తెలిపారు. బాధిత కుటుంబాలకు నిత్యావసర వస్తువులతో పాటు ప్రభుత్వం తరపున రూ.5 వేలు, గ్రామ వైఎస్సార్ సీపీ తరపున రూ.5 వేలు, ఎమ్మెల్యే సొంతంగా మరో రూ.5 వేలు మొత్తం రూ.15 వేలు ఒక్కొక్క కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పగడాల జయశ్రీ వెంకట రామిరెడ్డి, జెడ్పీటీసీ విజయలక్ష్మి రాజా, తహసీల్దార్ కిరణ్ కుమార్, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దండు చెన్నయ్య, మాజీ ఎంపీపీ ములకా రామతులసిరెడ్డి పాల్గొన్నారు.



ఆర్థికసాయం చేస్తున్న సీఐ సాంబశివరావు

సీఐ చేయూత

అందుగుల కొత్తపాలెం గ్రామంలోని అగ్నిప్రమాద బాధితులకు పట్టణ సీఐ సాంబశివరావు చేయూతను అందించారు. ప్రమాదంలో సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన కుటుంబాలకు నిత్యవసరాలు, రూ.20 వేలు ఆర్థికసాయం అందజేశారు.

ప్రశాంత జీవనాన్ని అలవర్చుకోండి



ఉప్పరపాలెం గ్రామస్తులతో సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ పి.సురేష్



కొచ్చర్లలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న పోలీస్ అధికారులు

- యడ్లపాడు ఎస్ఐ పి.సురేష్ వెల్లడి
- ఉప్పరపాలెంలో పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహణ
- గ్రామస్తులకు పలు విషయాలపై అవగాహన



సాతులూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సై బలరామిరెడ్డి

యడ్లపాడు: గ్రామాల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలని యడ్లపాడు ఎస్ఐ పి సురేష్ చెప్పారు. పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని ఉప్పరపాలెం గ్రామంలో పోలీసు శాఖ ఆధ్వర్యాన పల్లెనిద్ర కార్యక్రమం బుధవారం రాత్రి నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధిలో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ సురేష్ సిబ్బందితో కలిసి గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతినెలా రెండో శనివారం పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మండలం పరిధిలోని 23 గ్రామాల్లో ఉప్పరపాలెంలోనే అధిక కేసులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కొచ్చర్లలో పోలీసు పల్లెనిద్ర

ఈపూరు: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని కొచ్చర్ల గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో సమావేశమై వారి సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం నరసరావుపేట డీఎస్పీ మహేష్ మాట్లాడుతూ రాబోవు ఎన్నికల సమయంలో గొడవలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వినుకొండ రూరల్ సీఐ సుధాకరరావు, ఎస్ఐ మహమ్మద్ ఫిరోజ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైషమ్యాలు వీడి కలసికట్టుగా ఉండండి

నాదెండ్ల: గ్రామాల్లో రాజకీయ, కులమత పరమైన వైషమ్యాలు లేకుండా అందరూ కలిసికట్టుగా ప్రశాంత వాతావరణంలో జీవించాలని ఎస్సై జె.బలరామ్‌రెడ్డి చెప్పారు. సాతులూరులో బుధవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్ సాకారం చేసుకునేందుకు కష్టపడి పనిచేయాలని సూచించారు. పల్లెల్లో ప్రతి చిన్న విషయానికి ఘర్షణలకు దిగి కేసులపాలై సమయాన్ని జీవితాలను వృథా చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు గద్దె కోటేశ్వరరావు, రావుల శ్రీనివాసరావు, సీతయ్య, బాజి, శేఖర్, సాంబయ్య, ఆంజనేయులు, జె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పంట నమోదు జాబితాపై అభ్యంతరాలు తెలపాలి

చిలకలూరిపేట: ఖరీఫ్ సీజనుకు సంబంధించి పంట నమోదు జాబితాపై అభ్యంతరాలు రైతులు తెలియజేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి చెప్పారు. మండలంలోని కోమటినేని వారిపాలెంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఖరీఫ్ పంటలకు గాను పంట నమోదు కార్యక్రమం ఇప్పటికే పూర్తి చేయడం జరిగిందని చెప్పారు.

ఈ-క్రాప్ ముసాయిదా సరిచూసుకోవాలి

ఈపూరు: జిల్లాలోని అన్ని ఆర్‌బీకేలలో గురువారం నుంచి నాలుగు రోజుల పాటు సామాజిక తనిఖీ కోసం ఈ -క్రాప్ ముసాయిదా జాబితాను ప్రదర్శించడం జరుగుతుందని ఏవో రామారావు తెలిపారు. కొండ్రముట్ల ఆర్‌బీకే కేంద్రంలో ఈ-క్రాప్ ముసాయిదా జాబితాను గురువారం ఆయన పరిశీలించి నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంచారు.

ఈ-క్రాప్ నమోదు జాబితాలను పరిశీలించుకోవాలి

శావల్యాపురం: నియోజకవర్గంలో ఖరీఫ్ సీజనులో పంటలు సాగు చేసిన రైతులందరు ఈ-క్రాప్ నమోదు జాబితాలను రైతుభరోసా కేంద్రాల్లో ప్రదర్శిస్తారని ఏడీఏ బోయపాటి రవిబాబు తెలిపారు.

ఆర్బీకేల్లో ఈ - క్రాప్ ముసాయిదా జాబితా

వినుకొండ(నూజెండ్ల): సబ్‌డివిజన్ పరిధిలోని అన్ని ఆర్‌బీకేలలో ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు ఈ -క్రాప్ ముసాయిదా జాబితాను రైతులకు అందుబాటులో ఉంచనున్నట్లు ఏడీఏ రవిబాబు తెలిపారు



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

ఖరీఫ్-2023లో పంటలు సాగును ఈ- క్రాప్ చేయడం జరిగిందని, ఆయా ఆర్బీకేల్లో గ్రామసభలు నిర్వహించి ముసాయిదా జాబితాలోని రైతుల వివరాలను ఆర్‌బీకే సిబ్బంది తెలియజేస్తారు.

ఈ-క్రాప్‌పై అభ్యంతరాలు తెలపండి

నాదెండ్ల: మండలంలోని నాదెండ్ల-1 గ్రామ సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన గ్రామసభకు పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఐ మురళీ, జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి, నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ పాల్గొన్నారు. ఈ -క్రాప్ ద్వారా నమోదు చేసిన వివరాలను గ్రామ సభలో చదివి వినిపించారు.

మార్పు-చేర్పులకు ఇదే చివరి అవకాశం

యడ్లపాడు: మండలం పరిధిలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఇ-క్రాప్ నమోదు ముసాయిదా జాబితాను ప్రదర్శనకు ఉంచినట్లు యడ్లపాడు మండల వ్యవసాయ అధికారి సీహెచ్ సరిత తెలిపారు.

యార్డు మాజీ చైర్మన్‌కు కన్నీటి వీడ్కోలు

రొంపిచర్ల: వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గెల్లి సుబ్బారెడ్డి (80) గురువారం తన స్వగృహంలో గుండె పోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా రైతులకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయన మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటు అన్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు చపారపు గోపాలరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కురుగంటి శ్రీనివాసరెడ్డి, గానుగపంట ఉత్తమ్‌రెడ్డి, అన్నెం పున్నారెడ్డి, చపారపు సంజీవరెడ్డి, పచ్చవ రవీంద్రబాబు, మార్కెట్ యార్డ్ చైర్మన్ బత్తుల రామకృష్ణ, పునుగోటి వెంకట్రావు, గడ్డం వెంకట్రావు, గుండాల వెంకటేష్ తదితర నాయకులతో పాటు సీపీఐ నాయకులు కాసా రాంబాబు, వై.వెంకట్, సత్యనారాయణరాజు తదితరులు ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. అంతిమయాత్రలో వాహనాన్ని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ముందుండి నడిపారు.



అంతిమయాత్ర వాహనాన్ని నడుపుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

మాజీ మంత్రి కాసు కృష్ణారెడ్డి సంతాపం

రొంపిచర్ల : వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గెల్లి సుబ్బారెడ్డి మృతికి మాజీ మంత్రి కాసు కృష్ణారెడ్డి గురువారం సంతాపం తెలియజేశారు. ఆయన కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీలో దీర్ఘకాలం పని చేసిన తనకు, గెల్లి సుబ్బారెడ్డికి అవినాభావ సంబంధం ఉందన్నారు. ఆయన స్నేహశీలి, ప్రజాసమస్యలపై స్పష్టమైన అవగాహన కలిగిన వ్యక్తి అని అన్నారు.

ఉపాధ్యాయుల పాత్ర అపారం



ఆలోకం లక్ష్మీతులసీని సత్కరిస్తున్న హెచ్‌ఎంలు

యడ్లపాడు: పాఠశాల ప్రగతి..విద్యార్థుల ఉన్నతిని కాంక్షించినపుడే బోధన వృత్తికి వన్నెవస్తుందని ఎంఈఓ 1,2 నాగరత్నం, ఎస్ అరుణకుమారి చెప్పారు. మండలంలోని కొండవీడు యూపీ పాఠశాలలో గురువారం హెచ్‌ఎంల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మనబడి నాడు-నేడు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించిన జాలాది గ్రామ ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయిని ఆలోకం లక్ష్మీతులసీ సేవలు అభినందనీయమని కొనియాడారు. అనంతరం జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు గ్రహీత లక్ష్మీతులసీని సత్కరించారు. పాఠశాల హెచ్‌ఎం జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డైట్ లెక్చరర్స్, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు జి విజయభారతి, సుగంధరావు, కేవీ రామిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

జెడ్పీ హైస్కూల్‌కు ఇన్వర్టర్ అందజేత



పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇన్వర్టర్

చిలకలూరిపేట: పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలను ప్రోత్సహించేందుకు ముందుకు రావడం అభినందనీయమని పసుమర్రు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వై.హనుమంతరావు చెప్పారు. పసుమర్రులోని ఎస్ఎంకే జెడ్పీ హైస్కూల్‌కు దాత ముద్దన నరసింహారావు గురువారం ఇన్వర్టర్‌ను బహూకరించారు. ఆయనకు పాఠశాల ఉపాధ్యాయులు, 15,16 వార్డు కౌన్సిలర్లు జాలాది సుబ్బారావు, షేక్ మస్తాన్‌వలి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థి సంఘ నాయకులు గద్దె హరిబాబు, గోపాళం మధుసూధనరావు పాల్గొన్నారు.

పలు తీర్మానాలకు ఏకగ్రీవ ఆమోదం



మాట్లాడుతున్న చైర్మన్ దస్తగిరి

వినుకొండ(నూజెండ్ల): స్థానిక పురపాలక సంఘం సమావేశ మందిరంలో మున్సిపల్ సాధారణ సమావేశం గురువారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ షేక్ దస్తగిరి ఆధ్వర్యంలో కమిషనర్ వెంకయ్య అజెండాలోని 30 అంశాలను కౌన్సిల్ సభ్యులకు తెలియజేశారు. పట్టణంలో నూతన గ్రంథాలయం నిర్మాణానికి స్థలం కేటాయింపు, ప్రజా ప్రయోజనాల నిమిత్తం పురపాలక సంఘం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 30 పడకల వైద్యశాల నుంచి 100 పడకల వైద్యశాలగా ఏర్పాటు చేయడం, మైనార్టీ పాఠశాల నిర్మాణం, డిగ్రీ కళాశాలకు మెటల్ రోడ్డు నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణం, విద్యుత్ సమస్యలపై కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు బేతం గాబ్రియేలు, తెల్లాకుల రాజేష్ ఖన్నా, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆరు పూరిళ్లు దగ్ధం

బొల్లాపల్లి: విద్యుదాఘాతం సంభవించి 6 తాటాకు పూరిళ్లు దగ్ధమైన సంఘటన మండలంలోని గుమ్మనంపాడు గ్రామంలో గురువారం సాయంత్రం జరిగింది. బాధి తులు కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఉప్పుతోల శ్రీను పూరిగుడిశెలో విద్యుదాఘాతమై మంటలు వ్యాప్తి చెందాయి. పక్కనే ఆనుకొని ఉన్న త్రిమూర్తి, చిన్న అంకమ్మరావు, గుంజి అజిత్, వేముల కొండలరావు, గుంజి శ్రీనులకు చెందిన ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉప్పుతోల శ్రీను గుడిశెలో రూ.3 లక్షల నగదు, చిన్న అంకమ్మరావుకు చెందిన రూ.80 వేలు మంటల్లో కాలిబూడిదయ్యాయని బాధితులు బోరున విలపించారు.ప్రమాదం సమయంలో ఇళ్లల్లో ఎవరూ లేకపోవడంతో రెండు గ్యాస్ సిలెండర్లు పేలడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం మేరకు అగ్నిమాపక వాహనం సంఘటనా ప్రాంతాన్ని సందర్శించి మంటలను అదుపులోకి తెచ్చారు.



ప్రమాదంలో కాలిబూడిదైన ఇళ్లు